# దశ మారింది

రచన:
శ్రీ ఎం. కామేశ్వరరావు.

ప్రతీ మానవునికి జీవితంలో పది సంవత్సరాల కొక మారు మార్పులు కలుగుతూ వుంటాయి. యీ మార్పులు ఒక్కొక్కరి జీవితంలో ఒక్కొక్కలాగ వుంటాయి. వాటినే మనం అతని దశ మారింది అంటాము. మరి కొందరి బ్రతుకులు జీవితాంతం వరకూ ఒక్కలాగే వుంటాయి. 'యెన్ని దశలు తిరిగినా వాడి బ్రతుకు ఒక్కలాగే వుందిరా' అని అనుకుంటూవుంటాము.

వెంకన్న పంతులు కొడుకు వేణుదశ యీనాటి వరకు ఒక్కలాగేవుంది. తండ్రి రిటైరు అయిపోగానే యింటికి పెద్దవాడైన తను ఒక వుద్యోగంలో చేరవలసి వచ్చింది. కొడుకు రెండు సంవత్సరాలై వుద్యోగం చేస్తూవుండగానేఅతన్ని ఒక యింటివానిగా చేదామని, ముసలి ప్రాణానికి కొడుకుని కోడల్ని చూచి ఆనందించే కన్న యింకేంకావాలని అనుకున్నాడు తండ్రి. కొంచెం దగ్గర సంబంధాలు చూసి చేస్తే కోడలు వల్ల మనకు అనుకువగా వుంటుందని కటకంలో వున్న తన చెల్లెలు కూతురు సీతాలక్ష్మిని కొడుక్కి వివాహం చేసేడు. కొడుక్కి పిల్లనిచ్చినా పెళ్ళిచేసుకోవటం అట్టే యిష్టం లేదు. యెందుకంటే దగ్గర వాళ్ళను చేసుకునే కంటే దరిద్రం మరి ఒక్కటి వుండదని అతనికి తెలుసు. రెండు కుటుంబాల బ్రతుకులు వీధిని పెడతారు. అయినా తండ్రి మాట కాదనలేక పోయేడు.

అప్పుడే వేణుజీవితంలో మొదటి దశ మారింది. పెళ్ళాం కాపరానికి రాగానే తల్లిని తండ్రిని మర్చిపోయే రోజులు కూడ వచ్చేయి. పెళ్ళి అయిన దగ్గరనుంచి ఒక్క ఆరునెలలు యేం సుఖం అనుభవించేడు. అప్పుడే రభస బయలుదేరింది. అత్త కోడలుకి పచ్చగడ్డి వేస్తే భగ్గుమని మండుతోంది.

వేణు ఆఫీసునుండి రాగానే రోజూ యేదో ఒక రిపోర్టే. అవతల ఆఫీసులో బోలెడు పని యింటికి రాగానే యిల్లాలి పోరు. అతని మనసుకు ప్రశాంతతే లేదు.

'యేమిటి సీతా! యీగోల? నిండు యింట్లో ఆడది పోరుపెడితే అచ్చిరాదు. ముసలి దాంతో నీకేమిటి నోరుమూసుకొని వూరుకో రాదు!' అన్నాడు.

యేమిటండీ! అబ్బబా! మీ అమ్మతో నేను పడలేను. నేను చేసిన పనులు ఆవిడకు నచ్చవుట. ఆవిడ చేసుకోదుట. అబ్బబ్బా! కాల్చుకు తింటోంది. రాత్రి తొమ్మిది గంటలు అయిన వంటింట్లోంచి రానివ్వదు. యింకెప్పుడు మనం కులాసాగా కబుర్లు చెప్పుకుంటాము. చూడండి! మనం సుఖపడాలంటే యీ వూరునుంచి బదిలీ చేసుకు పోవడమే మార్గం అంది వయ్యారంగా. అంతవరకు వేడియెక్కి వున్న అతని బుర్ర ఒక్కసారి చల్లబడి పోయింది. సీతా అంటూ ఆమెను తన బాహువులలో తీసుకున్నాడు. ఆమె కోరిక అంగీకరించినట్లుగా.

మరునాడుఆఫీసుకు వెళ్ళాగానే T. A. లేకుండా

యేవ్వూరు యిచ్చినా వెళిపోతానని ధరఖాస్తు పెట్టేడు. వారం రోజుల్లో వేణుని కడప బదిలీ చేసినట్లు ఆర్డర్సు వచ్చేయి. అంత దూరం కొడుకు వెళ్తున్నందుకు తల్లి తండ్రి యేంతో విచారించేరు. యిదంతా కోడలు చేసిన పితలాటకమని వారికేం తెలుసు.

వేణు కడప వెళ్ళి ఎనిమిదేళ్ళు అయింది. ఒక్క కాని తండ్రికి పంపలేదు. పంపుదామన్నా అవకాశాలు అతనికి చిక్కలేదు. అప్పుడే ముగ్గురు పిల్లలు పుట్టేరు. నూటయాభై రూపాయిలు జీతం అతనికి చాలటం లేదు, ముసలివాడు డబ్బు పంపమని వుత్తరాలు రాసిరాసి వూరుకున్నాడు.

సీతా! మనం వచ్చి ఎనిమిదేళ్ళు పైనయింది. తల్లికి తండ్రికి ఒక్కసారి అయినా డబ్బు పంపలేదు.

'చాల్లెండి! వాళ్ళు పెట్టిన బాధలు మర్చిపోయేరా? నన్నే కాదు, మిమ్మల్ని కూడా యెన్ని బాధలు పెట్టేరు. యింతకి యీ రోజుల్లో యెవరి కుటుంబాలు వాళ్ళు పోషించుకోవడమే కష్టంగా వుంది. ఆ తల్లెటి గ్రామంలో వాళ్ళు యెలాగైన బ్రతుకుతారు. యిక్కడ మన బ్రతుకులు చూడండీ?'

'అవును. సుఖపడుదామని కదా యీ వూరు వచ్చేవు. నిన్ను పెళ్ళి చేసుకున్న దగ్గర నుండి ఒక్కలాగేవుంది నా బ్రతుకు.' మనకన్న తక్కువ జీతాలు తెచ్చుకుంటున్న వాళ్ళు హాయిగా వుంటున్నారు. ఖర్చులు తగ్గించుకోమంటే కనబడని ఖర్చులు పెంచుతున్నావు. ఆఖరికి నాకు అప్పులు మిగిలేయి. మూడు నెలలు క్రిందట ఆవకాయకు చేసిన అప్పు యిప్పటికి తీరలేదు, దశరాలకి నూటయాభై రూపాయిలు అరువుపెట్టి బట్టలు తీసేము. తోటివాళ్ళని చూసి యీసుకిపోతే యెంగిలాకులు చేతికి వస్తాయి. ఆశాయానికి మించిన ఖర్చులు, తాహతకు మించిన ధర్జాలు చేయకూడదు. లక్షసార్లు నీకు చెప్పేను సీతా, యింటికి వచ్చేటప్పటి కొద్ది క్షణాలైన మనసుని నిర్మలంగా వుంచవు. అప్పుడే పండక్కి రెండు వందల రూపాయిల ఖర్చు పద్దురాసేవు యివన్నీ యెలాగవస్తాయి? నీకు బుర్ర లేదు. నా బుర్ర పాడుచేస్తున్నావు.

వేణు జీవితంలో మూడవదశ దాటింది. అతని బ్రతుకు చిన్నప్పటినుండి యిప్పటి వరకూ ఒక్కలాగే వుంది. అన్నీ కష్టాలే. ప్రాణానికి సుఖంలేదు. బ్రతుకు భారం అయిపోయింది. కొంత కాలానికి పిచ్చివాడై పోతాడేమోనని అనిపిస్తోంది.

తెలివి తక్కువ యిల్లాలు అతన్ని సుఖపెట్టలేక పోతోంది. —


కథాంజలి

[చక్కని కథల మాసపత్రిక]

స్థాపితము 1938.

*

విడి ప్రతి, — 25 న. పై

సంవత్సర చందా, — రూ. 4-00

(ప్రత్యేక సంచికలతో సహా)

అన్ని హిగ్గింబాతమ్స్, స్వదేశమిత్రన్ బుక్‌స్టాల్సులలోనూ దొరుకును.